క్లుప్తంగా

జంతు బలి అధర్మం



ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

కొయ్యూరు: ప్రతీ మానవుడు శాకాహారిగా మారాలని కోరుతూ పాకలపాడు గురుదేవుల ఆశ్రమ భక్తులు ఆదివారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. జంతువును హింసించి చంపే హక్కు ఎవరికీ లేదని నినాదాలు చేశారు. శాకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని వివరించారు. మాంసహారంతో అనేక రకాల రోగాలు వస్తాయన్నారు. అనారోగ్యంతో ఉన్న మానవుడిని బతికించుకునేందుకు జంతువులను బలి ఇవ్వడం అధర్మంగా భావించాలని కోరారు. అన్ని జీవులపై కరుణ చూపాలన్నారు. ఈ సందర్భంగా హింస మూలంగా జరిగే అనర్థాలను వివరించారు.

కేంద్రం నిధులు మంజూరుపై హర్షం

రంపచోడవరం: అరకు పార్లమెంట్ పరిధిలో మన్యం రహదారుల అభివృద్ధికి పీఎం జన్‌మన్ పథకం కింద రూ.36 కోట్లు మంజూరు చేసినందుకు జాతీయ ఆదివాసీ సంరక్షణ సమితి అధ్యక్షుడు కారం సీతారామన్నదొర ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధులతో మూడు మండలాల్లోని 20 రహదారులను అభివృద్ధి చేయనున్నారన్నారు. వీటన్నింటికీ అనుమతులను అటవీ శాఖ తక్షణమే ఇవ్వాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వానికి మన్యం ప్రజలు రుణపడి ఉంటారన్నారు.

సీజనల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

హుకుంపేట: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో గిరిజనులు ముందస్తుగా అప్రమత్తంగా ఉండాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. వాతావరణంలో మార్పులు ఏర్పడి గిరిజన గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. ఎవరైనా జలుబు, దగ్గు తలనొప్పి, ఒళ్లనొప్పులు, జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నట్లయితే స్థానిక వైద్య సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. గ్రామాలతో పాటు ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ముమ్మరంగా వరినారు మడుల దుక్కులు



మామిడివాడ సమీపంలో ట్రాక్టరుతో దుక్కి చేస్తున్న రైతు

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో వరినారు మడుల దుక్కు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మామిడివాడ, గోకివాడ, పంచదార్ల, దిమిలి, కొత్తూరు, కట్టుబోలు, రాజుకోడూరు, రజాల, కుమ్మరాపల్లి, మర్రిపాలెం, మురకాడ సహా పలు గ్రామాల్లో ట్రాక్టర్ల సాయంతో రైతులు దుక్కి పనులు చేస్తున్నారు. ఈ ఏడాది సుమారు 8 వేల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు నారుమడుల తయారీలో రైతులు నిమగ్నమయ్యారు. రైతులకు వ్యవసాయశాఖ రాయితీపై వరి విత్తనాలను అందజేస్తుంది. మరో వారం పది రోజుల్లో విత్తనాలు వేసేందుకు రైతులు సిద్ధపడుతున్నారు.

కంటి శిబిరంలో 337 మందికి వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అచ్యుతాపురం: బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన 128వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 337 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 223 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. 67 మందికి మందులు అందజేశారు. 46 మంది కాటరాక్ట్ సర్జరీ చేసుకోవాలని సూచించారు. బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి ఆధ్వర్యంలో మజ్జిగ, భోజనం, ఫలహారం ఏర్పాటు చేశారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9676392974, 9390991099

టీకాలతో జీవాలకు రక్షణ

- సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు

పాడేరు డివిజన్ పరిధిలో పశువుల వివరాలు	
ఆవులు	4,73,975
గేదెలు	1,18535
గొర్రెలు	2,19,630
మేకలు	2,89,919



23ఎఆర్‌కే02... పశువులకు టీకాలను వేస్తున్న పశువైద్య సిబ్బంది...

అనంతగిరి: వర్షాకాలం వచ్చేసింది. ఈ సమయంలోనే సీజనల్ వ్యాధులు విజృంభిస్తుంటాయి. ఏమాత్రం అజాగ్రత్త వహించినా ప్రాణనష్టం తప్పదు. ఈ నేపథ్యంలో వ్యాధుల బారిన పడకుండా పశువులు, మేకలు, గొర్రెలకు ముందస్తుగా జిల్లా పశు సంవర్ధకశాఖ ఉచితంగా టీకాలు వేసేందుకు చర్యలు చేపట్టింది.

- **నల్లజాతి పశువుల్లో గొంతువాపు వ్యాధి**

నల్లజాతి పశువులైన బర్రెలు, దున్నల్లో ప్రస్తుత సీజన్‌లో అధికంగా గొంతువాపు వ్యాధి వ్యాపిస్తుంది. గొంతు కింది భాగం వాపుతోపాటు ఊపిరితిత్తులో నెమ్ము చేరుతుంది. తద్వారా పశువులకు ఊపిరి తీసుకోవడం ఇబ్బంది మారుతుంది. ఆయాసం, గురకతోపాటుగా తీవ్రమైన జ్వరం ఆహారం తీసుకోలేక మృత్యువాత పడే అవకాశం ఉంటుంది. ఇలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే రక్తపరీక్షలు ద్వారా వ్యాధి నిర్ధారించి, గొంతువాపు వ్యాధికి తప్పనిసరిగా హెచ్‌ఎస్ వ్యాక్సినేషన్ వేయించాలి.

- **తెల్లజాతి పశువుల్లో జబ్బువాపు వ్యాధి**

తెల్లజాతి పశువులైన ఆవులు, ఎద్దులు, లేగదూడలకు జబ్బువాపు వ్యాధి వ్యాపిస్తుంది. పశువులకు వెన్నుజబ్బ, వెన్ను, తొడ తదితర కండగల శరీరభాగాల్లో నల్లటి వాపు వస్తుంది. దీంతో పశువులకు జ్వరం రావడం, మేత మేయకపోవడం, కదల లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు పశువుల్లో కనిపించిన వెంటనే చికిత్స అందించాలి. బీక్యూ వ్యాక్సినేషన్ వేయించాలి.

- **గొర్రె, మేక ల్లో చిటుకు వ్యాధి**

తొలకరి వర్షాలకు మొలకెత్తిన లేతగడ్డిని గొర్రెలు, మేకలు మేసినప్పుడు వాటిల్లో ఉండే బ్యాక్టీరియా క్రిములు శరీరంలోకి వెళ్లడం ద్వారా చిటుకు వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన వెంటనే చికిత్స అందించాలి. లేదంటే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఈటీ వ్యాక్సినేషన్ తప్పనిసరిగా వేయించాలి.

టీకాలతో పశు వ్యాధులు దూరం..



వర్షకాలం ప్రారంభమైన నేపథ్యంలోని తెల్ల, నల్లజాతి పశువులతోపాటు జీవాల్లో అత్యధికంగా వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంది. ముందు జాగ్రత్తగా పశువులకు టీకాలు వేయించడంతో వ్యాధులు ప్రబలేందుకు అవకాశం ఉండదు. గ్రామాల్లో పశువులకు వ్యాధులు ప్రబలితే సమాచారం అందించండి. వెంటనే గ్రామాల్లో పశు వైద్య శిబిరం ఏర్పాటు చేసి, టీకాలను వేయిస్తాం. వర్షాకాలం కావడంతో సిబ్బందిని అప్రమత్తం చేశాం.

– సందీప్, పశువైద్యాధికారి, అనంతగిరి

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు



మునగపాకలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మునగపాక : జాతీయవాది స్వర్గీయ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమం ఆదివారం మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కిసాన్‌మోర్చా జోనల్ ఇన్‌చార్జి బత్తిన సాయిరాం మాట్లాడుతూ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సేవలు అమోఘమన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. జనసంఘ్‌ను స్థాపించి దేశంలోనే తొలి హిందూ సమాజ రాజకీయ పార్టీని స్థాపించిన నేతగా గుర్తింపు పొందారన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు యల్లపు రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ ఐటీ విభాగం జిల్లా కన్వీనర్ మళ్ల కాలేశ్వరరావు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బొడ్డేడ భాస్కర్, మండల ఉపాధ్యక్షుడు మళ్ల మల్లయ్యనాయుడు, ప్రధాన కార్యదర్శి సంపర భార్గవాచార్యులు, పార్టీ నేతలు గరివినాయుడు, వరలక్ష్మి, గణేష్, తేజస్వి, శ్రీరాములు పాల్గొన్నారు.

భగవద్గీతపై అవగాహన పెంచుకోవాలి



భగవద్గీతపై అవగాహన కల్పిస్తున్న లక్ష్మి

మునగపాక : చదువుతో పాటు అన్ని రంగాలపైనా అవగాహన పెంచుకోవాలని భగవద్గీత బోధకులు భీశెట్టి లక్ష్మి కోరారు. మంగళవరపుపేటలోని మా ఊళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్, భగవద్గీత శ్లోకాలు వాటి అర్థాలపై అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ భగవద్గీత ద్వారా విజ్ఞానం పెరుగుతుందన్నారు. గ్రంథాలయ అధ్యక్షులు భీశెట్టి ధనశ్రీను మాట్లాడుతూ గ్రంథాలయం సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డ్రాయింగ్‌లో నైపుణ్యం పెంచుకోవాలన్నారు. గ్రంథాలయ కార్యదర్శి యల్లపు సంజీవరావు, కోశాధికారి ఆడారి అప్పలనాయుడు, డైరెక్టర్లు సునీత, తులసి, అనురాధ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

మునగపాక : అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ పాపారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతవరకు నిర్వహించిన స్పందన కార్యక్రమానికి బదులుగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికగా మార్చారన్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రజలు తమ సమస్యలు విన్నవించుకునే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాపారావు కోరారు.

గురు శిష్యుల బంధం చాలా గొప్పది..



త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న హిందూ జ్ఞాన వేదిక సభ్యులు

కోటవురట్ల : ఆత్మ ఆరాధనతో ధర్మ స్థాపన జరుగుతుందని, అదే త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశ్యమని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి రాజమండ్రి కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు తెలిపారు. పందూరు గ్రామంలో జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు.

వారు మాట్లాడుతూ ఆత్మను సంపూర్ణంగా దర్శించగలిగినపుడే శిష్యుడు గురుత్వాన్ని పొందగలడని అన్నారు. సృష్టిలో గురుశిష్యుల బంధం చాలా గొప్పదని తెలిపారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ గురించి తెలుసుకోవాలని, అందులో ఆత్మ ఆరాధనతో ధర్మ స్థాపన జరుగుతుందని తెలిపారు. త్రిమత గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను రచించారని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, శ్రీనివాస్, స్వామి నాయుడు, ఆదిత్య పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని ర్యాలీ

కశింకోట : కశింకోట పంచాయతీలో తమకు ఆరు నెలలుగా రావలసిన వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ వరుసగా మూడో రోజు ఆదివారం పారిశుద్ధ్య కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక రిక్షా స్టాండ్ వద్ద నుంచి పెద్ద బజారు వరకు ఈ ర్యాలీ సాగింది. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాస రావు, ఏపీ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) అధ్యక్షుడు కొల్లి రామంజి, కార్యదర్శి జి. వెంకటరమణ, ప్రతినిధులు కొండబాబు, ఆదిలక్ష్మి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి దందా

- అక్రమంగా తవ్వకాలు
- ట్రాక్టర్ రూ.వెయ్యికి అమ్మకం
- అనధికార లేఅవుట్ స్థలాల్లోకి తరలింపు
- ప్రభుత్వాదాయానికి గండి
- జనసేన, టీడీపీ నాయకులే సూత్రధారులు
- చోద్యం చూస్తున్న అధికారులు



మామిడివాడ వద్ద స్థలంలో మట్టితో కప్పేసిన దృశ్యం



మామిడివాడ పరిధిలో తవ్వకాలు



మామిడివాడ రెవెన్యూ పరిధిలో చినకలవలాపల్లిలో అక్రమ లేఅవుట్ స్థలాల్లో భారీ మట్టి కుప్పలు

రాంబిల్లి : మట్టి బంగారంలా మారింది. మట్టికి డిమాండ్ ఏర్పడడంతో మట్టి మాఫియా రెచ్చిపోతుంది. 15 రోజులుగా అక్రమ మట్టి దందా యథేచ్ఛగా సాగిపోతున్నా అధికారులు కనీసం పట్టించుకోలేదు. కారణం మట్టి మాఫియాలో జనసేన, టీడీపీ నాయకులు సూత్రధారులు, పాత్రదారులు కావడమే. ఈ దందాకు కొందరు రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి అక్రమ మట్టి తవ్వకాలు జరిపి మట్టిని తరలిస్తున్న సందర్భంగా రెవెన్యూ, గనుల శాఖ అధికారులతో పాటు పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ వారెవరూ కన్నెత్తి చూడడం లేదు. మామిడివాడ రెవెన్యూ పరిధిలో గల చినకలవలాపల్లి గ్రామంలో ఎకరా 70 సెంట్లు పొలంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఆయా భూమిని వ్యవసాయ భూమిగా మార్పు చేయకుండానే వందలాది ట్రాక్టర్లుతో భారీ స్థాయిలో మట్టిని వేశారు. ఇక్కడ మట్టి కుప్పలు స్పష్టంగా కనిపిస్తున్నా అధికారులు పట్టించుకోలేదు. ఇదే మామిడివాడలో యలమంచిలి–గాజువాక బైపాస్‌రోడ్డును ఆనుకొని వున్న స్థలాన్ని మట్టితో నింపేసారు. పంచదార్ల రెవెన్యూ పరిధిలో రాత్రి వేళలో మట్టి మాఫియా చెలరేగిపోయి మట్టిని తరలిస్తుంది. గోకివాడ రెవెన్యూ పరిధిలో కూడా అక్రమార్కులు అడ్డూ అదుపు లేకుండా మట్టి తరలిస్తున్నారు. మండలంలో అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎటువంటి అనుమతులు లే యంత్రాల సాయంతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల సాయంతో లేఅవుట్లు, ఇతర స్థలాలకు తరలిస్తున్నారు. ట్రాక్టరు మట్టిని రూ. 1000 నుంచి రూ.1200 అమ్ముతున్నారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. అక్రమ మట్టి తవ్వకాల కారణంగా సుమారు రూ. 30 లక్షలు ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. అధికారుల వ్యవహార శైలి కారణంగానే మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కొత్తూరు, గోకివాడ రెవెన్యూ పరిధిలో మట్టి తవ్వకాలు చేస్తున్న పొక్లెయిన్, ట్రాక్టర్లు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

మట్టి అక్రమ తవ్వకాలు, తరలింపు విషయమై చర్యలు తీసుకుంటాం. క్షేత్ర స్థాయి పరిశీలన చేసి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. పోలీసు , రెవెన్యూ అధికారులతో నిఘా పెట్టిస్తాను.

– అప్పలస్వామి , తహసీల్దార్, రాంబిల్లి

ఆనాటి ఆ స్నేహమానంద గీతం



ఫకీర్‌సాహెబ్‌పేట జెడ్పీ హైస్కూల్ 1998–99 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు



సహచరులకు చిరు సత్కారం

చోడవరం రూరల్: పాతికేళ్ల క్రితం వారంతా ఒకే పాఠశాలలో పదవ తరగతి వరకు విద్యార్జన చేశారు. ఆ తర్వాత వేర్వేరు ప్రాంతాలు, వేర్వేరు వృత్తులు, ప్రవృత్తులలో నిలదొక్కుకున్నారు. ఇన్నాళ్లకు మళ్లీ వారంతా అదే చోట చేరి తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 1998–99 విద్యా సంవత్సరంలో పట్టణ శివారు ఫకీర్‌సాహెబ్‌పేట జెడ్పీ హైస్కూల్ టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలో తిరిగి కలుసుకున్నారు. తమ చిన్ననాటి అనుభవాలను పంచుకుని ఆనందంగా గడిపారు. అప్పటి ఆకతాయి చేష్టల్ని గుర్తు చేసుకుని మరీ ఆటపట్టించుకున్నారు. ఉన్నత పాఠశాలను ఉన్నత చదువులు చదివినవారు, ఉన్నత స్థానాలను అందుకున్న వారి సంగతులు తెలుసుకుని వారి ఎదుగుదలకు మురిసిపోయారు. వారి పిల్లలు, ఆర్థిక స్థితిగతులను తెలుసుకుని తమ వంతు చేయగలిగేదేమైనా ఉంటే చేసేందుకు తమ చిరునామాలు, మొబైల్ నంబర్లు షేర్ చేశారు. 25 వసంతాల తమ స్నేహానికి గుర్తుగా చిరు కానుకలను ఇచ్చిపుచ్చుకున్నారు.

26న గురుకుల మిగులు సీట్ల కోసం రాత పరీక్ష

గొలుగొండ: స్థానిక బాలుర గురుకుల కళాశాలలో మిగులు సీట్ల కోసం విద్యార్థులను రాత పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నట్లు ప్రిన్సిపాల్ రుత్తల రామకృష్ణ తెలిపారు. 6,7,8,9వ తరగతులలో మిగులు సీట్లు ఉన్నందున ఈ నెల 26న కళాశాలలో ఉదయం 10 గంటలకు రాత పరీక్ష నిర్వహిస్తామన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాడేరు డివిజన్ :
9010973030, 9010234557
Office mail : sakshiadvtvsp@gmail.com

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



మారేడుమిల్లిలో పేరుకుపోయిన ప్లాస్టిక్‌ను చూపుతున్న అనుదీప్

మారేడుమిల్లి: విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణం పూర్తిగా కలుషితమవుతోందని తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి వనవాసి స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తోంది. ఆ సంస్థ అధ్యక్షుడు గొర్లె అనుదీప్ కుమార్ ఆదివారం మారేడుమిల్లిలో మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంపై ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ఎంతగానో అవగాహన కల్పిస్తున్నాయని, దానికి ప్రజల సహకారం పూర్తిగా అవసరమన్నారు. ప్లాస్టిక్ వల్ల భూగర్భ జలాల కలుషితమవుతున్నాయన్నారు. పర్యావరణంపై పూర్తి ఆధిపత్యాన్ని ప్లాస్టిక్ కొనసాగిస్తుందన్నారు. దీన్ని సాధ్యమైనంత త్వరగా ప్రజలే పూర్తిగా నిషేధించుకోవాలని కోరారు. ప్లాస్టిక్‌ను జీవాలు తినడం వల్ల మృత్యువాత పడుతున్నాయన్నారు. ప్లాస్టిక్‌కు బదులుగా ఇతర ప్రత్యామ్నాయలపై దృష్టి సారించాలని కోరారు. దీనివల్ల పర్యావరణం పచ్చగాను సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండి ప్రజలు పూర్తిగా ఆరోగ్యంతో ఉంటారని సూచించారు.

వర్షాలతో కాలువల్లో పెరిగిన ఉధృతి



వర్షానికి జలమయమైన వీధిరోడ్డు



ఉధృతి పెరిగిన కాకరపాడు కాలువ

కొయ్యూరు: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇవే వర్షాలు మరో రెండు రోజులు కొనసాగితే కాలువలు మరింత ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉంది. ఇదే అదనుగా రైతులు వ్యవసాయ పనులు చేపట్టారు. వరి నారుమడులు వేసేందుకు దుక్కులు దున్నుతున్నారు. విత్తనాలు కూడా సకాలంలో రావడంతో పనులు చేపట్టారు. వ్యవసాయ శాఖ కూడా భూమిలో నత్రజని పెంపునకు వీలుగా పచ్చిరొట్ట వేయాలని సూచించింది. దీనికి అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచింది.

రైతన్నకు తోడ్పాటు అందించాలి



రైతులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న సభ్యులు

ఎస్.రాయవరం : ఆహారాన్ని పండించే రైతును ప్రతి ఒక్కరూ గౌరవించుకోవాలని జేడీ ఫౌండేషన్ సభ్యులు దూలపల్లి నాగేశ్వరరావు అన్నారు. కర్రివానిపాలెం గ్రామంలో ఆదివారం ఏరువాక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పలువురు రైతులను సత్కరించి రైతు ఆశయాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. దేశానికి అన్నంపెట్టే రైతన్నకి సహచరులు తోడ్పాటునిచ్చి పండించే పంటల్లో ఎరువులు, పురుగు మందులు లేకుండా ప్రకృతి వ్యవసాయం సాగుపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం 12 మంది రైతులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పోతు గోవిందరావు, పినపాత్రుని వెంకటరమణ, వీర వెంకట సత్యనారాయణ, అచ్చియ్యదొర, మోహన్‌రావు, గొర్లి రాము, శ్రీను పులి ప్రసాద్ పాల్గొన్నారు.